
# విడిది



శివల జగన్నాథరావు

కెవ్వుకెవ్వుమని పిల్లల ఏడ్పులు. తల్లుల లాలింపు. జోలపాటలో పక్కన సినిమాపాటలు మరోవైపునించి! కమ్మటి వాసనలు మత్తుగా వస్తున్నాయి. పట్టు చీరెల బరబరలు, చెప్పుల టకటకలు... అంతా రకరకాల శబ్ధాలతో, వింతవింత పరిమళాలతో చిత్రంగావుంది. వంటకాలు ఘుమ్మంటున్నాయి ఇంకోవైపునించి!

నేలంతా చింకికాయితాల్తో, అరటిపళ్ల తొక్కల్తో, విస్తరాకు ముక్కల్తో, గలీజుగావుంది. 'పరకాయించి చూస్తే పెద్ద బజారులావుంది' అనుకున్నాడు ఆనందరావు. ఎవరోఅబ్బాయిఅర్జెంటుగా అతన్ని రాసుకుంటూ వెళ్ళిపోయాడు. అలంకరించుకోక పోయినా ఆకర్షణీయంగా వున్న అమ్మాయొకతె రెండు గ్లాసుల్తో కాఫీతెచ్చి "తీసుకోండి, తొందరగా" అంది.

తీసుకుని—"ఈ రోజు ఇదిప్పటికి నాలుగోసారి..." అన్నాడు ఆనందరావు ఇబ్బందిని మొహంలో అభివ్యక్తం చేస్తూ.

"ఏం ఫర్వాలేదు. ఇది ఈ లోకపు అమృతం. అంచేత ఎన్నిసార్లుతాగినా బలమే" అని నవ్వింది అరవింద.

''ఇలాంటి ఫంక్షన్స్‌లో వేళల్తో నిమిత్తం లేకుండా కాఫీనీళ్లలాఖర్చవుతుంది" అన్నాడు ఆనందరావు.

"అంతేగద! మా కాఫీని నీళ్లతో కంపేర్ చేస్తున్నారనుకున్నాను".

నీళ్ళగ్లాసు పడినట్టు నవ్వింది అరవింద. తనూ వీలయినంతనవ్వడానికి ట్రయ్‌చేస్తున్న ఆనందరా ని ఒకబ్బాయి వచ్చి, "అగ్గిపెట్టెవుందా?'' అనడిగి, తీసుకుని చక్కాపోయాడు.

ఏదో మాట్లాడదామనివుంది ఆనందరావుకి.

అతనేమైనా కబుర్లుచెబితే వినాలని వుంది అరవిందకి.

గొడవ గొడవగావుంది విడిది.

అరవింద అతన్ని అబ్జర్వ్ చేస్తోంది. అది గమనించి ఆనందరావు సిగ్గుపడిపోతున్నాడు. అటు ఇటు దొంగచూపులు చూస్తున్నాడు. ముప్ఫయిరెండు పళ్లూ ఇగుళ్ళతోసహా బైటపెట్టి నవ్వుతున్నాడు ఎడంచేత్తో క్రాపింగు సవరించుకొంటున్నాడు.

అరవింద ఇబ్బందిగా కదిలింది.

వదినె ఎందుకో పిలుస్తున్నట్టుంది! వెళ్ళకపోతే బాగుండదు. ఇంటిదగ్గరయితే సాగుతుందిగాని ఇలాంటిచోట్ల అంటీ అంటకుండావుంటే అంతా ఏదోలా చూస్తారు!

"నేను వెళతాను'' అంది అరవింద.

''వెళ్ళి ఏంచేయాలని?''

"ఏదో పనుండకపోతుందా మాకు? మీ మగవాళ్ళల్లా కబుర్లేసుకుందుకి వీలవదు."

"మొహంకడుక్కుంటాను. బాత్రూం చూపించండి."

"మీ మగపెళ్ళివారి విడిదికివెళ్లండి. ఇక్కడ మీకు చోటులేదు."

"మీ మనసులో తప్పు..."

'భగవంతుడా! అనుకుంది అరవింద ఆ డైలాక్కి గుండెలు ఝల్లుమనగా.

వాళ్ళిద్దరి పరిచయం చిత్రంగా జరిగింది ఆడపెళ్లివారి విడిదిలో. పెళ్ళికొడుకు నరసింహానికి అక్కయ్య కొడుకు ఆనందరావు. వుద్యోగరీత్యా బందరులో వుంటున్నాడు. నరసింహం అత్తవారిది ఈ వూరే అయినా, వాళ్లది బాగా చిన్న ఇల్లుకావటాన వూళ్లో సత్రవపెళ్లికి విడిదిగా కుదుర్చుకున్నారు. అక్కడికి పదిగజాలదూరంలో మరో ఇంటిని మగపెళ్లివారికోసం ఏర్పాటు చేశారు. ఆనందరావు కుటుంబం అతని కంటె రెండ్రోజులు ముందే పెళ్లికి తరలిపోయింది. శలవుగ్రాంటు చేయించుకుని, తెమిలి అతను ఆ తర్వాత వచ్చాడు. రిక్షాదిగి, లోపలికి వెళుతూ, అక్కడి మనుషులంతా కొత్తకాగా వుక్కిరిబిక్కిరయ్యాడు.

మధ్యన కల్యాణమంటపం, చుట్టూ గదులు. వీధిద్వారానికి ఎదురుగా కని

పిస్తూ కాస్తదూరానబ్రాత్రూంలు. మంటపం మీద పెళ్లికూతురి తల్లి దండ్రుల్ని కూచోపెట్టి పురోహితుడు వాళ్ళచేత ఏదోపూజ చేయిస్తున్నాడు. ఒకబట్టతలా యన వంటబ్రాహ్మణ్ణి మంచినీళ్ళతో కడిగి పారేస్తున్నాడు! కాఫీవాసన, వుప్మావాసనలతో ఆ చోటంతా నిండి పోయింది. సరిగంచు సిల్కుచీరె చెంగు బొడ్లో దోపి, వుప్మాహండా దగ్గరకూచు న్నావిడ, పిల్లకాయల్తో హడావుడి పడు తూంది. "అమ్మా! దువ్వెన ఏదే?" అంటూ ఓ పిల్ల ఓ గదిలోంచి మరోగది లోకి పరిగెత్తింది. వీధి వరండాలో చెప్పులషాపుని ఇంప్రూవ్‌చేస్తూ ఎవరె వరో వస్తూనే వున్నారు. ఇద్దరు చిన్న జెడల అమ్మాయిల్తో ఆ పక్కనించి వెళు తూన్న పెద్దకళ్ళ అమ్మాయిని చూసి 'ఎక్కడో చూసినట్టుందెక్కడో చూసి నట్టుంది' అనుకున్నాడు ఆనందరావు.

ఆ మాటే తనూ రెండుసార్లనుకుందా అమ్మాయి.

'ఎక్కడ చెప్మా?' అని ఆలోచించు కున్నారిద్దరూ.

ఆనందరావు చిన్నతనంలో, వాళ్ల ఇంటి పక్కనే వుండి, అతన్తోపాటు ఒకటో క్లాసునించి థర్డుఫారం వరకు చదువుకున్న, రెండుజెళ్ల, పెద్దకళ్లపిల్ల జ్ఞాపకంవచ్చి, 'ఈపిల్లే!అవునీఅమ్మాయే' అనుకున్నాడు.

వెడల్పాటి చెవులూ, చిలుకముక్కు లాగా కొంచెం వొంగిన ముక్కూ, గెడ్డం దగ్గిర ఆ పుట్టుమచ్చా, అటు ఇటు ఆ దొంగచూపులూ–'అతగాడే! అవునతనే సుమా!' అనుకుంది అరవింద.

కాస్సేపు ఆశ్చర్యపోయి, పలకరించు కుని, పెద్దవాళ్లమయ్యామన్న భావనతో వులిక్కిపడి, హఠాత్తుగ సిగ్గుపడ్డారు. ఆనందరావు తను, ఎం.కాం. చదివి, బందరుకాలేజీలో లెక్చరరు చేస్తున్నట్టు చెప్పాడు. ఇంకా పెళ్లికాలేదన్న మాట ? అడిగాడు.

"మీరు...ఏం చదివారు?"అడిగాడు.

"నేనాండి..." సిగ్గుపడి – "ఏదో బియ్యే...అయిందనిపించాన్లెండి." చేతి వేళ్ళు చూసుకుంది

"ఇంక టైపూ, షార్టుహాండూ ఏం నేర్చుకోలేదా?"

'ఇదేమిటి? పెళ్ళిచూపుల ఇంటర్‌వ్యూ నిస్తున్నాడు?' అనుకుని, అతనిటే చూస్తుందే ఎర్రబడ్డ చెంపల్తో "వుఁహు" అని తలిటూ అటూ తిప్పింది.

"అదేమో, మరి...వాటికి దేనికీ ప్రయత్నించలేదు. పత్రికలుపారాయణం చేస్తూ నేనూ ఎందుకు రాయకూడదని కొన్ని కాగితాలు ఖరాబుచేశాను."

"మీరు రాస్తారా?" జూలో జంతువుని చూసినట్టు చూశాడు.

"ఏం లాభం? నాకష్టమేఁ మిగి లింది. ఎన్నిపంపినా అన్నీ టూవేట్రాఫిక్ అయ్యాయి." నిట్టూర్చింది. "అయినా అంతా రచయిత్రులైతే ఎలాచెప్పండి?"

ఆనందరావుచూపుల్తో ఆఅమ్మాయిని ఎక్స్‌రే తీస్తూ నిలబడ్డాడు. తన వూళ్లో ఫ్రెండ్స్ దగ్గర వాడి, వాడి వదిలేసిన జోకులేవో ఇక్కడ ప్రయోగించాడు. అవి తనకి కొత్తకాగా నవ్వి, నవ్వి అలిసిపోయింది అరవింద.

మరీ నాజూకయిన మనిషి కాకపో యినా, నాగరికంగా తయారయ్యే అరవింద. ముద్దబంతిపువ్వులావుంటుంది. ముద్దు ముద్దుగా మాట్లాడుతుంది. అరవింద చూపులతూపులు గుచ్చుకున్న చోట చెప్పరాని బాధ ఏదో బయలు దేరుతుంది - ఇది ఆనందరావు భావన! అరవింద పెదాల్ని సాగదీసి నవ్వితే ఆ మత్తులో పడని మనిషి మగవాడే కాడు! - ఇదీ ఆనందరావు ఆలోచనే!!

కొంచెం వదులుగా రెండు జెళ్లువేసి- ఒక్క జడలోమాత్రం మల్లెదండని అల వోకగా తురుముకుని - పచ్చని నుదుట పైసాలో సగం బొట్టు దిద్దుకుని-పల్చటి చీరెలో వొయ్యారంగా వొదిగిపోయే అరవిందని తనువు మరచి చూస్తూన్న ఆనందరావు తేరుకుని - తమ విడిది ఎక్కడో ఆమె నడిగి తెలుసుకుని - బయల్దేరాడు.

మగపెళ్లివారి విడిది రెండే గదులు. చిన్నవి! వచ్చినచుట్టాలు బస్సులో దూరి నట్టు దూరలేకా, మానలేకా ఇబ్బంది పడుతున్నారు. "మన ఆనందం వొచ్చే డ్రా!" అంది నరసింహంతల్లి, పెద్ద గొంతుతో! ఆవిడకి హఠాత్తుగాఆశ్చర్యం కలిగినా, ఆనందం కలిగినా సైరన్లాంటి తనగొంతు విప్పి, ఎవళ్లతోనో తన సంతోషాన్ని పంచేసుకుంటుంది. తన మాట ఎవరు విన్నా, వినకపోయినా ఆవిడ కిబ్బంది లేదు. నిజంగా ఇప్పుడా విడ మాట అక్కడెవరూ విన్పించు కోలేదు! ముగ్గురాడాళ్ళు పెళ్లికబుర్లు చెప్పుకుంటున్నారు. ఒకావిడ ఆడపెళ్లి వారి పార్టీ! ఒకావిడ మగపెళ్లివారిపార్టీ!

"నువ్వు నూరుచెప్పు, వెయ్యిచెప్పు, అక్కయ్యా. నాకిది ఇష్టంలేదు" అంది అరుంధతి. ఆవిడకిష్టంలేనిది పెళ్లికొడుకు పెళ్లికూతురికి గొలుసు పెట్టకపోవటం:

"ఆరువేలు కట్నం తీసుకోగలడు గాని, మనవాడు ఆ మాత్రం బంగారం పెట్టలేడా? ఎంత అన్యాయం! అటువం టప్పుడు కట్నం తీసుకోకూడదు!" అందావిడ ఓ ప్రఖ్యాత రచయిత్రి రాసిన పుస్తకం పేజీ త్రిప్పుతూ.


"చెంబెడు నీళ్ళివ్వండి" అన్నా డానందరావు, కాళ్లు కడుక్కుందామని.

"వాళ్లబాధ ఏదో వాళ్ళు పడతారు. మధ్య మనకెందుకు లెద్దూ?" అంది మీనాక్షి.

"నీళ్లు కావాలి" అడిగాడానందరావు ఆత్రంగా చూస్తూ.

"చూస్తూవుండు! తగువు బయల్దేరు తుందెలాగునూ" అంది అరుంధతి.

"నీళ్ళెక్కడవున్నాయో చెబుతారా"




అంటూ తనవాళ్లకోసం వెతికాడు ఆనందరావు. తల్లి, తండ్రి, తమ్ముడు, చెల్లెలు ఎవరూ కనిపించలేదు. వాళ్లంతా బజారుకి వెళ్లారని ఒకబ్బాయి చెప్పాడు.

అక్కడే మరో ఇద్దరు ఆడాళ్లు జుత్తులు దువ్వుకుంటూ కబుర్ల సముద్రంలో పీకలవరకు మునిగిపోయి వున్నారు. "వంటేం బావులేదు సుమా, వొదినా! పులుసు నీళ్లల్లావుంది. ఇహ మజ్జిగ సరేసరి."

"ఏడాది పొడుగునా పెట్టి పోషించాలా, ఏమన్నానా? పెళ్లిచేసిన రెండ్రోజులయినా కొంచెం శుభ్రంగా వంటకాలవీ చూడరాదూ? కట్నం ఇచ్చేస్తున్నామని బడాయి!"

ఆనందరావు ఒక అబ్బాయిని అడిగి పెరట్లోకి వెళ్లాడు. లంకంత పెరడది! ఓ వయిపు గేదెల పాకల్తో, పేడ ముద్దల్తో, నానా గత్తరగా వుంది. పెద్ద నుయ్యి! నీళ్లు పాతాళంలోకి వున్నాయి! అక్కడక్కడా చిన్నకుర్యా! 'ఈదేశంలో కుర్యాలకి కొదవలేదు' అనుకున్నాడు. రెండు బాల్చీల్తప్ప చెంబేదీ లేదు! అతని వూహలో విడిది అంటే చక్కని సదుపాయాలతో, నీటుగా, విశాలంగా గదులతో హాయిగా సౌకర్యంగా వుంటుందని...ఇది ఏమిటి? విడిదేనా? భగవాన్ బాల్చీకోసం అరగంట నుంచుని, రెండు చేదలు తోడేసరికి డొక్కల్లో నెప్పి వచ్చింది. స్నానంచేసే ప్రయత్నానికి స్వస్తిచెప్పి, మొహం, కాళ్లు చేతులు కడుక్కున్నాడు. గదిలోనికి జొరబడ్డాడు. అది మరోగది! అవి మొత్తం రెండేగదులు! వరండాలాంటిదైనా లేదు!

అక్కడ - దేవతలు పరివేష్టించి వుండగా—పవళించిన మహావిష్ణువులా-

పెళ్లికొడుకు నరసింహం చుట్టాలమధ్య ఎత్తయిన పెట్టెలాంటి దానిమీద (శేష తల్పం!) కాలుమీద కాలేసుకుని, చేతులు తలకింద పెట్టుకుని, పడుకున్నాడు. అతని ప్రక్కన ముగ్గురు అతనీడు కుర్రాళ్లున్నారు. వాళ్లమధ్య ఏదో చర్చ జరుగుతూంది. శ్వేతకష్టాలు తెగ తగల బడిపోతున్నయ్.

"కట్నాల విషయమే తీసుకుందాం. మన నరసింహమే కొన్నిసార్లు 'కట్నం తీసుకునే మగవాడు మనిషికాడు' అన్నాడు మరి...ఇప్పుడు..." ఆగాడు పువ్వుల గురూ షర్టు.

నరసింహం మొహం ఆముదం తాగి నట్టయింది. పొడిదగ్గు దగ్గాడు.

"ఆస్తి పాస్తులున్నవాళ్లు కట్నాలు తీసుకోకూడదన్నాను. నాకీ వుద్యోగం తప్ప మరో ఆధారం ఏముంది? ఈ మాత్రం స్టేటస్‌కి రావటానికి ఎన్ని అప్పులుచేశానో?! అవి తీర్చటానికి ఈ కట్నం తీసుకోవటం తప్పనిసరి..."

"అప్పులు తీర్చటానికి కట్నమే ఎందుకు తీసుకోవాలి? నీ జీతం మరీ తక్కువేం కాదే? మీ ఫామిలీకూడా కొద్ది మంది. అయిదువందల రూపాయల్లో అప్పులు తీర్చలేవూ? నెలకింతని? నువ్వో అప్పు తీర్చటానికి కట్నం తీసుకుంటావు. మరొకడు చెల్లెలిపెళ్లి చెయ్యటానికి కట్నం కావాలంటాడు..."

"ఒరే!హరగోపాల్! నీకివాళ ఇక్కడ పెళ్లిభోజనం వద్దా?" అని పెద్దచెంప లబ్బాయి గురూషర్టుని మందలించాడు.

సంభాషణ ఆగిపోయింది. ఆనంద రావు ద్వారం దగ్గరికి పోయి నుంచు న్నాడు గుమ్మం దగ్గర ముగ్గురు పిల్లలు పాటలకచ్చేరీ నిరాటంకంగా కొనసాగి స్తున్నారు. రేడియోగ్రాంపెట్టినట్టు ఒకరి వెనకఒకరు ఎడతెరిపి లేకుండా పాడేస్తు న్నారు! ఓ ముసలాయన గోడకాన్చి వున్న వెడల్పాటి బెంచీమీద కాళ్ళానించి తలదాకా దుప్పటి బిగించి గురక తీస్తు న్నాడు. నరసింహం పెదనాన్న ఓపక్క కూచుని–''ఏం ఖర్మం వచ్చిపడిందర్రా, ఎంత అన్యాయం చేశారర్రా, వాళ్ళు, మనకి! పగవాళ్లకయినా వద్దర్రా ఈ బాధా..." అని, వూ, తెగవిచారిస్తు న్నాడు! ఆయన విచారం – ఆడపెళ్ళి వారు ఇలాంటి అరకతరకల విడిది ఇచ్చేరనిట! కాస్సేపటికి ఆనందరావు తల్లీ తండ్రీ వాళ్లూ బజార్నించి వచ్చారు. వాళ్లతో కబుర్లలోపడ్డాడు.

సాయంత్రం అవుతూంటే నుయ్యి దగ్గర పెద్దగుంపుచేరిపోయారు గదుల్లో అద్దాలు – దువ్వెనలు – పౌడరుడబ్బాలు బంతుల్లా అందరిచేతుల్లో పరిగెత్తాయి.

"అద్దం ఏదర్రా? ఒక్కసారిలా ఇయ్యండమ్మా, అద్దం?"

"మేం దువ్వెన తీసుకువచ్చేం, వదినా...ఎక్కడ పడేసేడో మా కుర్ర వెధవ."

"ఆ తిలకం నేను దిద్దుతానుండాసే! నీకు చేతకాదు.''

"ఆయనెంత సేపమ్మా ఆ పౌడ్రరా స్తాడు? దబ్బావుడ్చిగా నివ్వదేమిటి?''

మగాళ్ళని బయటిగ్గెంజేసి, ధడాల్న తలుపులు బిగుంచుకున్నారాడాళ్ళు.

సిల్కుచీరెలూ-పట్టుకోకలూ-చంద్రహారాలూ-టెరీకాట్, డెకరాన్, నయిలెక్సులూ, స్క్వేర్‌వాచీలూ - పంజాబీ డ్రెస్సులూ, బెల్‌బాటంలూ - పాంట్లూ, షర్టులూ, బూట్లూ- దిక్కుదిక్కునా బయల్దేరుతున్నాయి. ఆనందరావు ట్రిమ్‌గా తయారయి, కాస్త సెంట్ షర్టుకి రాసుకున్నాడు. ఆ పరిమళంలోఅరవింద ఆలోచనకి వచ్చింది. నరసింహం, ఫ్రెండ్సు రమ్మంటే రానని ఆడపెళ్లారి విడిదివేపు నడిచాడు.

అరవింద అవ్సరసలా తయారయి ఇద్దరమ్మాయిల్తో హస్కు కొడుతూంది. ఆనందరావుని చూసి వాళ్ళని పంపించేసింది.

''మీరేం అనుకోనంటేఒకమాట...'' అన్నాడానందరావు.

"ఏమిటో అది?'' కనురెప్పలు రెపరెపలాడ్చి చూసింది.

"మీరిచ్చిన విడిదికన్నా రైల్వే ఫ్లాట్‌ఫాం నయమనిపిస్తోంది."

గలగలనవ్వి - "ఈ మాట నాతో కాదు. పెళ్ళికూతురి తండ్రితో చెప్పండి" అంది.

"సరేగాని బీచ్‌కి వస్తారా?''

"మీతోనా?" ఆశ్చర్యంగా చూసింది.

''యేం? నేను తమకి కొత్తా? భయమా?"

"ఎక్కడికి పారిపోయానో అనుకుంటారు మావాళ్ళు".

''ఈ మహాసందట్లో ఎవరెక్కడికి వెడుతున్నారో ఎవరుచూసేరు? ఇదిగో- మీరురాకపోతే నేనూ వెళ్లనరవిందా!"

"వెళ్ళక?" నవ్వేకళ్లతో అడిగింది.

''తమరెక్కడ వుంటే... అక్కడే, ఈ చెంగుపట్టుకుని..."

"అమ్మయ్యో! మీరెంతకయినా తగుదురు!"

"ఆఖరిమాట! వస్తారా, రారా?"

''కొంచెం ఆగాలి, మా తమ్ముణ్ణీ, చెల్లాయి నితీసుకుని..."

'పానకంలో పుడకలు!' సిగరెట్ నోట్లోపెట్టి అగ్గిపుల్ల కసిగా గీశాడు.

* * *

రాత్రి భోజనాలకి పిలుపురాగానే ఆనందరావు నరసింహంతో వెళ్ళాడు.

ఇంకా వడ్డన మొదలవలేదు. అరవిందని వెదుకుతూ ఆ చోటంతా తిరిగాడు అక్కడగదులు ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్స్‌లా వున్నాయి! రెండు కుళాయిలు... బాత్రూంలు. లెట్రిన్స్... ఆనందరావుకివుడుకుమోత్తనం వచ్చింది. తాము ఎలా అవస్థపడితే వీళ్ళకేం? వీళ్ల సదుపాయాలు చూసుకున్నారు కదా!

అబ్బాయొకడు గదులకి తాళాలు వేసేస్తూ, ఆ తాళంచెవులగుత్తి అటిటు తిరుగాడుతున్న తల్లికాబోలు చూపు తున్నాడు - 'నేన్చాలా కేర్‌ఫుల్‌గా వున్నానుస్మా అమ్మా!' అన్నట్టు! ఆవిడ మూతి కాశీనించి రామేశ్వరందాకా సాగ దీసి నవ్వుతూంది. 'చాలా సంతోషం నాయనా!' అన్నట్టు! భోజనాలు ఆరం భించారు. వంటకాలు ఫర్వాలేదు. ఒకా యన లడ్డూలపళ్ళెంపట్టుకువచ్చి, ఇద్దరికి వేసి, తరవాత ముగ్గురు వద్దు వద్దన గానే, తక్కినందరికీ లడ్డూ చూపించు కుంటూ వెళ్ళిపోయాడు! అడగాలేక, మానాలేక పడేవాళ్ల అవస్థకి ఆనందరావు నవ్వాపుకోలేక పోయాడు. ఓ సిల్కు కమీ జాయన తనకబుర్లతో తన కిటు, అటు కూచున్న పదిమందిని కడుపులు నింపేస్తూ, వంటకాల్ని విస్తళ్లలో వేస్టు చేయిస్తున్నాడు. అరవింద వచ్చింది. ఆమె మోహినిలానూ, చేతుల్లో గిన్నె అమృతపు పాత్రలానూ కనిపించాయి ఆనందరావుకి. వుల్లాసంగా ఏదో అన బోయి అరవింద కనుసైగచేస్తే వూరు కున్నాడు. చాలామంది వంటకాలు పారే శారు. మన ఫంక్షన్స్‌లో వేస్టు ఎక్కువ. ఈ విడిదిలూ, ఈ భాగోతం అంతా ఎందుకొచ్చిన తంటా యిది? సింపిల్‌గా దండల పెళ్లి చేయించేసి, చిన్నపార్టీఇస్తే పోలా?' - అనుకున్నాడు.

ఇప్పటివరకు ఒక విధంగా బాగానే నడిచింది కాలం. తరవాతే ఎలాగడవటం అన్న సమస్య వచ్చింది. తెల్లవారు ఝామున రెండుగంటలకి ముహూర్తంట! 'ఈరోజు శివరాత్రి అయినాబావుండును జాగారం చేసిన పుణ్యమన్నా దక్కును!' అనుకున్నారు మగపెళ్లివారు. రెండు చిన్నగదుల్లో ఎందరని పడుకుంటారు? పిల్లలు కొందరెలానో చోటుచేసేస్తుని పడుకున్నారు.

"పోనీ, భజన చేద్దావేఁవిట్రా?" అన్నాడొకాయన.

"బాజాలవాళ్లని పిల్చి వాయించ మందాం."

ఆడపెళ్లారొచ్చి పిల్చుకు పోతా రేఁవో! బావుండదూరొ్కండి:"

"పగవాళ్లకయినా వద్దర్రా, ఈ బాధ ఎంత అన్యాయం చేసేరర్రా!" అంటు న్నాడు నరసింహం పెదనాన్న!

"ఏం చేస్తాం? మొదటే మాట్లాడు కోవల్సింది, మంచి విడిదిమ్మని" అంది మీనాక్షి.

కొంతమంది రెండోఆట సినిమాలకి వెళ్లిపోయారు.

"పెళ్ళికి వచ్చింది సినిమాలకోసఁ వర్రా?" ఎవరో అడిగారు!

"పెళ్లికి వచ్చింది నిద్దర్లకోసఁవర్రా?" మరెవరో అడిగారు!

"రోజూ ఎవరింట్లో వాళ్లు నిద్దర్లు పోవటంలేదూ?"

"భానుమతి పాటలెవరన్నా పాడం

దమ్మా...ఈ కష్టంలో ఆవిడ పాటలే సుఖం ఇవ్వాలి.''

"నాకురావు... నాకు రావు ...''

సిగ్గులు, సిగ్గులు

"మరి వొచ్చినవేఁవిటి? నిద్దర్లా?"

నవ్వులు. నవ్వులు.

"లైటార్పేండే. నాకు నిద్దర్రావడం లేదూ!" ఓపిల్లాడరిచాడు.

"నీ కోసం మేమంతా అంధకారంలో ఆహుతయిపోవాలంట్రా! గాడిదా!"

"మీ టాటాలో చ లి ఎక్కువను కుంటాను."

"పక్కాలా నిలాబాడీపొడండర్రా?"

"ఎవరి పక్కానా నిలాబాడీ?"

"లై టే! ఆరిపేయండే!"

"పీకెనొక్కేస్తా న్వెధవకానా!!"

"నరసింహం! నీ కట్నం, నీ సౌక ర్యం చూసుకున్నావుగాని, నీ వాళ్లసదు పాయాలు చూసేవు కావురా!''— మేన మాఁవ ఆక్రోశం!

"పగవాళ్లకయినా వొద్దర్రా ఈ బాధా!" -పెదనాన్న ఆవేదన!

ఆడాళ్ళు ఆడపెళ్లివారి అన్యాయం గురించి చెప్పుకుంటున్నారు. మగాళ్ళు రాజకీయాలు చర్చించుకుంటున్నారు. ఎవరి గొడవలో వాళ్ళుండనే వున్నారు. ఇద్దరు ప్లేస్‌చాలక షిఫ్టుడ్యూటీ చేద్దామను కుంటుంటే బాజాలు వినిపించాయి పెద్ద పెట్టున.

"అదిగో, అమ్మో! వాయించేస్తు న్నారు!" కొందరు లేచిపోయారు.

"ఎవరే? ఎవర్నీ ?" అంటూ పడు కున్న ముసిలాయన లేచికూచున్నాడు.

"మిమ్మల్నీ, నన్నూ కాదుగాని... పడుకోండి" ఆయన సతీమణి ఎర్ర కళ్లతో అంది.

మళ్లా పాతాళగంగదగ్గర సినిమారష్. గదుల్లో పౌడర్‌స్నోల ఘుమ ఘుమలు! చీరెల బరబరలు! అంత తెల్లారు ఝామునా అంతాఅప్సరసలయిపోయారు!

పెళ్ళి మంటపంలో—

"అమ్మాయికి బంగారం పెట్టడం సనాతనంనించి వస్తున్న పద్ధతి. మీరు అడిగిన కట్నం మేం ఎట్లా ఇచ్చాము? పైసాకి వెనకదీసేమా?" అంటూంది నరసింహం అత్తగారు. ''చూడండమ్మా. ఇదెంత ఘోరఁవో?" అంది. వెంటనే ఘోరాన్ని చూట్టానికి నలుగురమ్మలు వచ్చారు. మాటకి మాట కలిపి సాయం చేశారు.

నరసింహంలో నరుడు కాస్సేపు తప్పుకున్నాడు. సిహం జూలు కదిలించి, గర్జించింది.

"నేను బంగారానికి ప్రిఫరెన్స్ ఇవ్వ లేదు. నేను మొదట్నించీ ఒక్కమాట పైనే వున్నాను ఇప్పుడు మరోలా చెయ్యను-నా కిష్టంలేనిపని మీరు చేయిం చినా, జీవితాంతం మీ అమ్మాయిని ఆ వూసు ఎత్తి సాధిస్తూనే వుంటాను... అది మీకూ, మీ అమ్మాయికీ సమ్మతమా?"

తగువు తాటాకుమంటలా భగభగ మండి, ఆరిపోయింది.

ఆనందరావు పీటలమీద తననీ, అరవిందనీ వూహించుకుంటున్నాడు. మధుపర్కాలతో—ముడిపడినబంధాలతో—అగ్నిచుట్టూ ప్రదక్షిణం చేస్తూ—మాంగల్యధారణ కావిస్తూ— తలంబ్రాలు పోసుకుంటూ—పన్నీరుబుడ్డీ తెచ్చి అరవింద తడిపేసేవరకు అతనీ లోకంలో లేడు. త్రుళ్ళిపడి చూశాడు. కిలకిల నవ్వింది. వేలుచూపి 'నీపనిచెప్తానుండు!' అన్నట్టుచూశాడు. నాలికచాపి, వెక్కిరించి, వెళ్ళిపోయింది. తాంబూలం ఇస్తుంటే ఎవరూ చూడకండా చూసి చెయ్యిపట్టుకు, అరచేతిలో గిల్లాడు.

పెళ్ళి అయిపోయింది.

ఆనందరావు సూట్ కేస్ సర్దేశాడు. శలవులేదు, ఇంక! వెళ్లిపోవాలి! వెళ్ళిపోతున్నాడు!...వెళ్లగలడా?

వెళ్ళిపోతున్నట్టు చెప్పాడు అరవిందతో. కాలం కాస్సేపు స్థంభించింది.

"అరవిందా! నువ్వేమయినా మాటలాడు?"

'ఏమ్మాట్లాడను?' అన్నట్టు చూసింది.

"మా ఫాదర్ని మీ ఫాదర్ తో మాట్లాడమంటాను..."

అరవింద రెండుక్షణాలు తదేకంగా చూసి అంది: ''మా నాన్న నాకు పెళ్లి కుదిర్చేశారు...వచ్చేనెలలోమీకు...శుభలేఖ వొస్తుంది..."

"అరవిందా!" అతని చూపు నిలిచిపోయింది. ఇది చేదుమాత్ర!

"అరవిందా! నిన్ను నా జీవితంలోకి తెచ్చుకుందామనుకున్నాను. ఈ కొంచెం సమయంలో నీమీద ఎన్నెన్నో ఆశలు పెంచుకున్నాను. నువ్వు...నువ్వు ..."

"ఆనందం! చాలాకాలానికి మిమ్మల్ని చూశాను. అనుకోకుండా కలిశాము. ఏదో సరదాగాగడిపేశాం విడిపోతున్నాం క్షమించండి! నాకు పెళ్లి కుదిరిపోయింది అన్నమాట చెప్పడానికి అవకాశం రాలేదు. ఇది విడిది, ఆనందం! ఎవరయినా తాత్కాలికంగా కలుసుకుందికి మాత్రమే ఇది చోటు. పెర్మనెంటుగా వుండ వీల్లేనిస్థలం కదూ? ఇక్కడ...

"...ఇక్కడ మన కలయిక కూడా అంతే మరి. ఈ సమాగమాన్ని జ్ఞాపకంలో పదిలపరుచుకొందికే గాని, దృఢం చేసుకొందికి కాదు... ఆ వీలు లేదు..."

దూరంనించి ఏదో బాండుమేళం వస్తోంది. ఆ సన్నాయిమోత శ్రావ్యంగా లేదు ఆనందరావుకి. దగ్గరగా జరిగాడు.

"అరవిందా..." ఏదో చెప్పబోయాడు.

"క్షమించు ఆనందం!" అరవింద గబగబ వెళ్లిపోయింది.

చప్పట్లు దగ్గరయ్యాయి, చెవులు బ్రద్దలవుతున్నాయనిపించింది. ఆనందరావు గట్టిగా నిట్టూర్చి అటుచూస్తూ నిలబడ్డాడు.

———